క్లుప్తంగా

సేవాలాల్ జయంతిని జయప్రదం చేయాలి

• ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ : మిర్యాలగూడలో శనివారం నిర్వహించే గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం ఉదయం 10గంటలకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి బంజారా భవన్‌లో జరిగే మహాభోగ్ బండార్ కార్యక్రమానికి మిర్యాలగూడ నియోజకవర్గ గిరిజనులు, గిరిజన నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవాలి

చింతపల్లి: ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి అన్నారు. శుక్రవారం పాఠశాలలోని విద్యార్థినులకు కరాటే మాస్టర్ సురేష్ ఆధ్వర్యంలో కరాటే, ఫిట్నెస్ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే బాలికలకు మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అన్వర్, సుధీర్, సౌజన్య, బాల్‌రెడ్డి, రవి కుమార్, శివలీల, మునిపాల్ తదితరులు పాల్గొన్నారు.

16న గురుకుల ప్రవేశ పరీక్ష

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని తెలంగాణ గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో 2025–2026 సంవత్సరానికి గాను సీట్ల భర్తీకి ఈ నెల 16వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బి.జానునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు తమ వెంట పరీక్ష ప్యాడు, పెన్నులు, హాల్ టికెటు తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర వస్తువులు పరీక్ష కేంద్రంలోకి అనుమతి ఉండదని తెలిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

గుర్రంపోడు : మెదక్ జిల్లాలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సమగ్ర శిక్షలో క్లస్టర్ రిసోర్స్‌పర్సన్‌లుగా పనిచేస్తున్న రమేష్‌నాయక్, ఎర్ర శ్రీనివాస్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరందాసు సంతోష్ ప్రభుత్వాన్ని కోరారు. 14 సంవత్సరాలుగా కంట్రాక్టు ఉద్యోగులుగా సేవలందించిన వారికి ప్రభుత్వం కనీసం అంత్యక్రియల ఖర్చులు కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 135మంది చనిపోయారని, ఏళ్ల తరబడి గొడ్డు చాకిరీ చేయించుకుంటూ చనిపోతే అనాథల్లా వదిలేయడం సరికాదన్నారు. ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొండమల్లేపల్లి: అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారమ కొండమల్లేపల్లి మండలం చింతచెట్టుతండా గ్రామంలో పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్మూర్తి తెలిపారు.

ఇద్దయ్య మృతి బాధాకరం



కున్‌రెడ్డి ఇద్దయ్య భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లికి చెందిన కున్‌రెడ్డి ఇద్దయ్య మృతి బాధాకరమని కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎంఏ.సిరాజ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం కొండమల్లేపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన ఇద్దయ్య భౌతికకాయాన్ని సిరాజ్‌ఖాన్ సందర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో నాయకులు ఉట్కూరి వేమన్‌రెడ్డి, కైసర్‌ఖాన్, గంధం సురేష్, పెద్దిశెట్టి సుధాకర్, అందుగుల లింగయ్య, వస్కుల బక్కులయ్య, నజీర్ మౌలానా, బూడిద మల్లేష్, పెద్దిశెట్టి సత్యం, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

తిప్పర్తి ఆర్‌ఐ బదిలీ

తిప్పర్తి : మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న బదిలీ అయ్యారు. మండలంలోని ఇండ్లూరు గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి రెసిడెన్సి సర్టిఫికెట్ జారీ చేసే విషయంలో అమర్యాదగా ప్రవర్తించడంతో సదరు వ్యక్తి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వద్ద తన గోడు వెల్లబుచ్చాడు. మంత్రి వెంటనే స్పందించి ఆర్‌ఐని బదిలీ చేయాల్సిందిగా కలెక్టర్‌ను ఆదేశించడంతో బదిలీ చేసినట్లు తెలిసింది. ఈ విషయమై తిప్పర్తి తహసీల్దార్ స్వప్నను వివరణ కోరగా.. ఆర్ సాధారణ బదిలీపై వెళ్లారని తెలిపారు.

నిందితులను శిక్షించాలి

నల్లగొండ టౌన్ : తమిళనాడు రాష్ట్రం శివగంగా జిల్లాలో దళిత యువకుడి చేతులు నరికిన నిందితులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత యువకుడు అయ్యస్వామి బుల్లెట్ బైకు కొనుగోలు చేసి నడుపుతుంటే జీర్ణించుకోలేని అగ్రవర్ణ యువకులు ఆ యువకుడి రెండు చేతులను నరకడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. కుల వివక్షతలను రూపుమాపాల్సిన పాలకులే పెంచి పోషిస్తున్నారని విమర్శించారు.

సమీకృత మార్కెట్ పూర్తయ్యేదెన్నడో!



అసంపూర్తిగా ఉన్న మార్కెట్ నిర్మాణ పనులు

• మిర్యాలగూడలో రూ.4.50 కోట్ల వ్యయంతో మొదలైన పనులు
• బిల్లులు రాక మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. వెజ్, నాన్ వెజ్, పూలు, పండ్ల దుకాణాలు ఒకే ఆవరణలో ఉండేలా రూ.4.50 కోట్ల వ్యయంతో ఎన్‌ఎస్‌పీ క్యాంపులోని మినీ రవీంద్రభారతి పక్కన గల రెండు ఎకరాల భూమిలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2022లో సమీకత మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 2023 జూన్ వరకు పనులు పూర్తి చేయాలనే లక్ష్యం పెట్టుకున్నారు. అయితే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం సరిగా నిధులు మంజూరు చేయకపోవడంతో పనులను మధ్యలోనే నిలిపివేశాడు. కాంట్రాక్టర్ రూ.2 కోట్ల మేర పనులు చేసి బిల్లులు పెడితే.. అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేవలం రూ.80 లక్షలు మాత్రమే విడుదల చేసింది. పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ఆ ప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.

108 దుకాణాలు నిర్మించాలని ప్రణాళిక

మిర్యాలగూడలో రూ.4.50 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ సమీకృత మార్కెట్‌లో 108 దుకాణాలను నిర్మించాల్సి ఉంది. వీటిలో 30 దుకాణాలు మాసం, చికెన్, చేపల కోసం, 18 దుకాణాలు పూలు, పండ్ల వ్యాపారానికి కేటాయించగా మిగిలిన 60 దుకాణాలు మాత్రం కూరగాయాలు అమ్ముకునేందుకు అవకాశం ఉంది. పట్టణంలో రోడ్లపైనే కూరగాయాలు, పండ్లు, మాసం, చికెన్ దుకాణాలు, తోపుడు బండ్లు కనిపించకుండా అందరూ ఒకే చోట వ్యాపారం చేసుకునేలా ఏర్పాటు చేయాలని భావించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కార్పొరేట్ షాపింగ్ మాల్ తరహాలో మార్కెట్‌ను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో పని మొదలు పెట్టినా.. నిర్మాణం మాత్రం ఆదిలోనే ఆగిపోయింది. ఈ సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు పూర్తయితే ఎంతో మేలు జరుగుతుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

నిధులు రాగానే పనులు చేపడతాం



మిర్యాలగూడలో రూ.4.50 కోట్లతో చేపట్టిన సమీకృత మార్కెట్‌కు రూ.80లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. ఆ నిధుల వరకు మొదటి అంతస్తు స్లాబ్ వరకు పనులను చేపట్టాం. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ఈ విషయంపై ప్రభుత్వానికి గతంలోనే నివేదిక పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులను వేగవంతంగా పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం.

– మనోహర, పబ్లిక్ హెల్త్ డీఈ, నల్లగొండ

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



మిర్యాలగూడలో విధులు బహిష్కరించిన న్యాయవాదులు

మిర్యాలగూడ టౌన్ : రంగారెడ్డి కోర్టులో న్యాయమూర్తిపై ఓ ముద్దాయి చెప్పు విసిరినందుకు నిరసనగా శుక్రవారం మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రామకృష్ణారెడ్డి, సకినాల వేలాద్రి, ఉపాధ్యక్షుడు ఇబ్రహీం, కోశాధికారి పవన్‌కుమార్, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, బహునూతల వేణుగోపాల్‌రావు, పెంటారెడ్డి, రాజ్‌కుమార్, మస్తాన్, మోహన్, అలుగుబెల్లి వెంకట్‌రెడ్డి, వీడీ ప్రసాద్, ఎల్లయ్య, పరమేష్, లింగంపల్లి శ్రీనివాస్, మల్లేష్, మంద సైదులు, ఆర్.భాస్కర్, పుల్లారెడ్డి, కొంక వెంకన్న అశోక్, పులి శ్రీరాములు తదితరులు ఉన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

దేవరకొండ: పలు కేసుల్లో విచారణ ఎదుర్కొంటున్న ఓ నిందితుడు రంగారెడ్డి కోర్టులో జిల్లా 9వ అదనపు న్యాయమూర్తిపై దాడి చేయడాన్ని ఖండిస్తూ దేవరకొండ బార్ అసోసియేషన్ న్యాయవాదులు శుక్రవారం తమ విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల ఆంజనేయులు మాట్లాడుతూ న్యాయమూర్తిపై నిందితుడు దాడికి పాల్పడడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఉమామహేశ్వర్, షౌకత్‌అలీ, ముస్తాక్ అహ్మద్, చెనగాని అశోక్, వనం జగదీష్, శ్రీకాంత్, గణేశ్, బార్ అసోసియేషన్ న్యాయవాదులు తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో సౌకర్యాలు కల్పిస్తాం



నకిరేకల్ : విద్యార్థినులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి



శాలిగౌరారం పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

• కలెక్టర్ ఇలా త్రిపాఠి

నకిరేకల్ : ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకల పాఠశాల, కళాశాలను శుక్రవారం రాత్రి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి విద్య, భోజనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో డ్రెయినేజీ సమస్య ఉందని, విద్యార్థులకు దుస్తులు ఉతుక్కునేందుకు వాష్ ఏరియా నిర్మించాలని కలెక్టర్‌ను ప్రిన్సిపల్ శోభారాణి కోరారు. అదేవిధంగా రెండు అదనపు తరగతి గదులు, లైబ్రరీ భవనం మంజూరు చేయాలని కోరారు. స్పందించిన కలెక్టర్.. డ్రెయినేజీ, వాష్ ఏరియా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ బాలయ్యను ఆదేశించారు. అదనపు తరగతి గదులు, లైబ్రరీ భవనం మరో 3 నెలల్లో నిర్మించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ యానాల అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణ పీడీ రాజ్‌కుమార్, స్థానిక తహసీల్దార్ జమురుద్దీన్ ఉన్నారు.

అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి

శాలిగౌరారం: ప్రభుత్వ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా పాఠశాల వసతి గృహంలోని సిబ్బంది, విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లు, వంటగది, మూత్రశాలలను పరిశీలించారు. వసతి గృహంలో వంటగది, డ్రెయినేజీ ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, పాఠశాల చుట్టూ ఫెన్సింగ్ వేయించాలని విద్యార్థినులు కలెక్టర్‌ను కోరారు. స్పందించిన కలెక్టర్.. తక్షణమే తన కోటా నిధుల ద్వారా పాఠశాల చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. రిజిష్టర్లు, మందుల నిల్వల రికార్డులను పరిశీలించారు. తదుపరి స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి వసతిగృహంలో సమస్యలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట నల్లగొండ ఆర్డీఓ అశోక్‌రెడ్డి, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్‌కుమార్, తహసీల్దారు యాదగిరి, ఎంపీఓ పద్మ ఉన్నారు.

దేశ రక్షణలో సైనికుల పాత్ర గొప్పది



వీర జవాన్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, ఉపాధ్యాయులు

హాలియా : దేశ రక్షణలో సైనికుల పాత్ర గొప్పదని, ప్రతిఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని ఎస్‌ఐ సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పబ్లిక్‌స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని వీరజవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడారు. దేశ సైనికులు తమ జీవితం మొత్తం దేశం కోసమే దారపోస్తారన్నారు. అదే విధంగా గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొర్ర శంకర్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అమరులైన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలన్నారు. కార్యక్రమంలో హాలియా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ మేడిపల్లి మోహన్‌రావు, డైరెక్టర్ తడకమళ్ల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ గోపినాయర్, ప్రముఖ వ్యాపార వేత్త చిట్టిప్రోలు యాదగిరి, పేలపూడి బాలకృష్ణ, శ్రీనివాస్, యడవెల్లి రాంబాబు, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంఘం సహాయ కార్యదర్శి రమావత్ నరేష్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నేనావత్ అశోక్‌నాయక్, ఉద్యోగ సంఘం నాయకులు రమావత్ రవినాయక్, నియోజకవర్గ నాయకులు ప్రదీప్‌నాయక్, రాంబాబునాయక్, శివనాయక్, కుర్ర మునినాయక్, లావుడియా రాజేష్, దేవేందర్, నిమ్మ, బద్రి, తదితరులు ఉన్నారు.

వీర జవాన్లకు ఘన నివాళులు

మిర్యాలగూడటౌన్ : పుల్వామా ఉగ్రదాడిలో అమరవీరులైన వీర జవాన్లకు శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం పట్టణ కమిటీ అధ్యక్షుడు దైద శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధీరావత్ ధర్మానాయక్, ఉపాధ్యాయులు కృష్ణకాంత్‌నాయక్, సంఘం నాయకులు దైద సంజయ్‌కుమార్, నర్సింహ, సురేందర్, శంకర్, వెంకట్, గోపి, కొండల్, రోహిత్, విజయ్, రాజు, వెంకటేష్, శరత్, రవి, సాయినాథ్, చింటూ, సైదులు, కిశోర్, గిరి, అవినాష్ ఉన్నారు.

పుల్వామా అమరులకు నివాళి

దేవరకొండ : పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన జవాన్లకు శుక్రవారం దేవరకొండ ఎంకేఆర్ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ రమావత్ రవి అమర జవాన్ల చిత్రపటాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హాలియాలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, ఉపాధ్యాయులు



హాలియాలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న గిరిజన సంఘం నాయకులు

‘మిర్యాల’లో నక్షపై ఏరియల్ సర్వే

మిర్యాలగూడ టౌన్ : నక్ష పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఆర్‌వీ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం శుక్రవారం హెలికాప్టర్ సహాయంతో ఏరియల్ సర్వేను చేపట్టింది. ఈ సర్వేలో లైడార్, ఫొటో గ్రామెట్రీ సాంకేతికత ద్వారా మున్సిపాలిటీకి సంబంధించిన నక్ష్యాలను ఫొటోలు తీసుకున్నారు. ప్రధానంగా మున్సిపాలిటీకి సరిహద్దు అయినా నందిపాడు, వెంకటాద్రిపాలెం, హైదలాపురంతో పాటు పట్టణంలోని పలు డీజీపీఎస్ పాయింట్లను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. సర్వేను సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఫరీద, జిల్లా ఏడీ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్, టీపీఓ సోమయ్య, టీపీఎస్ అంజయ్య, ఆర్‌వీ కన్సల్టెంట్ మల్లారెడ్డి, సర్వేయర్ హరీష్ పర్యవేక్షించారు. మొదటి విడతలో శుక్రవారం, శనివారం ఏరియల్ సర్వే చేసిన అనంతరం ఈ ఫొటోలన్నీ.. కోర్స్ స్టేషన్, రోవర్ల సహాయంతో వచ్చిన ఫీల్డ్ సర్వే కొలతలతో పొల్చుకుంటారు. నిర్దేశించిన స్థలాల హద్దులు, కొలతల మేరకు రేఖాంశాలు కోర్డినేటర్లతో రూపొందుకున్న సర్వే మ్యాప్‌లను సర్వే ఆఫ్ ఇండియా రికార్డుల్లో నమోదు చేయనున్నారు.



హైదలాపురం వద్ద డీజీపీఎస్ పాయింట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మహ్మద్ యూసుఫ్

గిరిజన రైతు ఆత్మహత్యపై స్పందించిన కలెక్టర్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం కొత్తపేట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రకాలువ తండాకు చెందిన గిరిజన రైతు హర్యానాయక్ గురువారం ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలపై స్పందించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి రైతు ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్‌ను ఆదేశించడంతో.. ఆయన ఏఓ ధీరావత్ సైదానాయక్‌ను పురమాయించారు. ఏఓ తండాకు వెళ్లి వివరాలు సేకరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆత్మహత్యకు పాల్పడిన రైతుకు రుద్రారం గ్రామ శివారులో 0.38 గుంటల భూమి ఉంది. అతని అక్క, చెల్లెలుకు వచ్చిన వాటా భూమిని ఇతరులకు అమ్మేందుకు ప్రయత్నించగా ఆ భూమిని మనమే కొనుగోలు చేద్దామని భార్య హర్యానాయక్‌తో చెప్పింది. దీంతో ఇప్పటికే అప్పులు ఉన్నాయి కదా, ఆ పొలాన్ని మనం కొనలేమని హర్యా ఆమెతో చెప్పాడు. ఈ విషయంలోనన మనస్థాపాని గురైయి ఆత్మహత్య చేసుకున్నట్లు విచారణలో వెల్లడైంది. నివేదికను జిల్లా వ్యవసాయ అధికారికి పంపుతామని ఏఓ తెలిపారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషిచేయాలి

• ఎమ్మెల్యే బాలునాయక్

చందంపేట : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు నేటి యువత కృషిచేయాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. చందంపేట మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు అంబేద్కర్ విగ్రహాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ఆవిష్కరించి మాట్లాడారు. భారత రాజ్యాంగాన్ని రచించడంతో అంబేద్కర్ పాత్ర ఎనలేనిదన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం అంబేద్కర్ ఎంతోగానో పోరాడారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు సిరాజ్‌ఖాన్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీశైలం యాదవ్, వేణుధర్‌రెడ్డి, ముక్కమల వెంకటయ్య గౌడ్, మాజీ ఎంపీపీలు ముత్యాల సర్వయ్య, గోవిందుయాదవ్, బద్యానాయక్, మాతంగి కాశయ్య, కిన్నెర హరికృష్ణ, అనంతగిరి, మల్లారెడ్డి, రంగయ్య గౌడ్, కొండ్రపల్లి నాగేష్, వెంకటయ్య, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

యూరియా అందుబాటులో ఉంది



యూరియా నిల్వను పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

మిర్యాలగూడ : రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లో గల ఎన్‌డీసీఎంఎస్, కేకే ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని పీఏసీఎస్‌లు, డీసీఎంఎస్‌లలో యూరియా నిల్వలు ఉన్నాయని తెలిపారు. సోమ, మంగళవారాల్లో రెండు ర్యాక్స్ యూరియా వస్తుందని.. ఈనెలలో మరో 10వేల మెట్రిక్ టన్నుల యూరియా రానుందని వివరించారు. రైతులు అధికంగా యూరియా వాడితో పొలాల్లో చీడపీడలు అధికమై అగ్గితెగులు, కాండం తొలుచు పురుగు అధికంగా వచ్చి దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఓ ధీరావత్ సైదానాయక్, రైతులు శేఖర్‌రెడ్డి, హరిబాబు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుల, మతాంతర వివాహాలకు రక్షణ చట్టం తేవాలి

మిర్యాలగూడ టౌన్ : కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారికి రక్షణ కోసం చట్టం తేవాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమడాల పరశురాములు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వినయ్, తేజల ప్రేమ వివాహం జరిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులాంతర వివాహాలు చేసుకుంటే దాడులు, హత్యలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వారిని రక్షించే వ్యవస్థ కూడా లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోడిరెక్క మల్లయ్య, దేవయ్య, ఆర్కే, రణదీప్, సందీప్, మణికంఠ తదితరులున్నారు.



మిర్యాలగూడలో ప్రేమికులకు వివాహం చేసిన కేవీపీఎస్ నాయకులు

యువత క్రీడల్లోనూ రాణించాలి


దేవరకొండ : యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని దేవరకొండ అసిస్టెంట్ ఎస్పీ మౌనిక సూచించారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మిషన్ పరివర్తన్ –యువతేజం కార్యక్రమంలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు క్రీడల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఐలు నర్సింహులు, సురేష్, ధనుంజయ, తహసీల్దార్ సంతోష్ కిరణ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ మౌనిక

పొదుపు పథకం వర్తింపజేయాలి

నల్లగొండ టౌన్: మగ్గం నేసే ప్రతి చేనేత కార్మికుడితోపాటు అనుబంధ వత్తి కార్మికులు మరో ఇద్దరికి చేనేత పొదుపు పథకం అమలు చేయాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత పొదుపు పథకంలో అనుబంధ కార్మికుల పొదుపు రూ.200 తగ్గిస్తూ రూ.600 పొదుపు చేసుకుంటే రూ.1200 ఖాతాలో జమ చేస్తామని చెప్పడం సరికాదన్నారు. కార్మికులకు, సహకార సంఘాలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ అమలు చేసి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని కోరారు. హౌస్ కం వర్క్ షెడ్ పథకం కింద చేనేత కార్మికులకు 120 గజాల స్థలం ఇచ్చి ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో తెలంగాణ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేశ్, ఉపాధ్యక్షులు కర్నాటి శ్రీరంగం, రాపోలు వెంకన్న, గడ్డం దశరథ, కర్నాటి వెంకటేశం, గోషిక నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మురళీధర్

బీసీ రాజ్యాధికార సమితి కోకన్వీనర్‌గా సత్యనారాయణ

మిర్యాలగూడ టౌన్ : బీసీ రాజ్యాధికార సమితి మిర్యాలగూడ మండల కోకన్వీనర్‌గా మండలంలోని బి. అన్నారం గ్రామానికి చెందిన సింగం సత్యనారాయణ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం మిర్యాలగూడలో సత్యనారాయణకు ఆ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా కన్వీనర్ లింగంపల్లి చిరంజీవి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. సంఘం బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కుల గణన సర్వేకు మరోసారి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. బీసీలందరూ హక్కుల సాధనకు ఒకే వేదికపైకి వచ్చి ఐక్యంగా పోరాడాలని కోరారు. తన నియమకానికి సహకరించిన అందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కాగా, సత్యనారాయణ నియామకం పట్ల బీసీ సంఘం నాయకులు కాతోజు వినోద్‌కుమార్, రవీందర్, శ్రీను తదితరులు హర్షం వ్యక్తం చేశారు.



సత్యనారాయణకు నియామకపత్రం అందజేస్తున్న చిరంజీవి